సాక్షి బాపట్ల

శనివారం । 17 । ఆగస్టు । 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేటః పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ శుక్రవారం సాయంత్రానికి 44.85 టీఎంసీలకు చేరింది. దిగువకు రెండు గేట్ల ద్వారా 57,737 క్యూసెక్కులు వదిలారు.



సామూహిక వరలక్ష్మి వ్రతం

పిట్టలవానిపాలెం: చందోలులోని శ్రీ బగళాముఖిని శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీ వరలక్ష్మీదేవిగా అలంకరించారు. సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 7,814 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

వైభవంగా అమ్మవారి జన్మదిన వేడుకలు



తెనాలి: మండల పరిధిలోని బుర్రిపాలెం గ్రామంలో వేంచేసిన శ్రీసర్వదేవ పరంజ్యోతి మానవసేవ ఆలయంలో శ్రీసర్వదేవ పరంజ్యోతి భగవతి పద్మావతి అమ్మవారి జన్మదిన వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. బుర్రిపాలెం, పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు. 108 కలశాలతో కోలాటం నడుమ ఊరేగింపుగా చక్రాయపాలెం, బుర్రిపాలెం నుంచి భక్తులు ఆలయానికి చేరుకున్నారు. భక్తిప్రపత్తులతో కలశ పూజలు చేశారు. అష్టలక్ష్మి పూజ నిర్వహించారు. భక్తులు తమ వెంట తెచ్చిన 108 ప్రసాదాలను అమ్మవారికి సమర్పించారు. ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ సేవకులు, సేవాసమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం తెనాలిలోని శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు.

76,970 హెక్టార్లలో ఖరీఫ్ పంటల సాగు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో ఖరీఫ్ పంటల సాగు సాధారణ విస్తీర్ణం 1,25,914 హెక్టార్లు కాగా, ఇప్పటి వరకు 76,970 హెక్టార్లలో సాగయ్యాయి. జూన్ మూడో వారం నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. జిల్లాలో వరి సాధారణ సాగు 63,733 హెక్టార్లు ఉండగా, 49,270 హెక్టార్లలో వెద పద్ధతిలో సాగు చేశారు. పత్తి 26,982కుగాను 18,927 హెక్టార్లలో సాగైంది. కంది 30, మొక్కజొన్న 23, పెసర 22, మినుము 554, వేరుశనగ 67, నువ్వులు 262, చెరకు 20, జూట్ 278, పసుపు 1101, టమాటా 1151, కూరగాయలు 1714, పచ్చిరొట్ట 3393 హెక్టార్లలో సాగయ్యాయి. మిరప సాధారణ విస్తీర్ణం 20,625 హెక్టార్లకుగాను 158 హెక్టార్లలో సాగు చేశారు. మిరప సాగుకు సెప్టెంబర్ రెండో వారం వరకు అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు.

పసుపు కొమ్ముల అలంకరణలో భ్రమరాంబ



పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణమాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకొని అమ్మవారిని పసుపు కొమ్ములతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. గర్భాలయం, అంతరాలయంలో పసుపు కొమ్ముల దండలను అలంకరించారు. ఆలయ ప్రాకార మండపంలో అన్నప్రాసనలు, నామకరణలు, అంత్రాలయ అభిషేకాలు, దర్శనాలు, వాహనపూజలు జరిపించారు. పొంగలి నైవేద్యాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ ఉప కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి శ్రావణ మాసం మూడో శుక్రవారం లక్ష మల్లెపూలతో అలంకరణ ఉంటుందని ఉప కమిషనర్ పేర్కొన్నారు. చివరి శుక్రవారం అమ్మవారిని లక్ష గాజులతో అలంకరిస్తామని తెలిపారు. అదేరోజు శ్రావణమాస ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తామని వివరించారు.

యార్డులో 46,624 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 39,118 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 46,624 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,700 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 17,864 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

రాజుల సొమ్ము రాళ్లపాలు అన్నట్లు ప్రజల సొమ్ము అన్న క్యాంటీన్ల పాలవుతోంది. మరమ్మతుల పేరిట కూటమి ప్రభుత్వం తెలుగు తమ్ముళ్లకు ప్రజల సొమ్మును పంచి పెడుతోంది. వాస్తవానికి అన్న క్యాంటీన్ల భవనాల్ని గత ప్రభుత్వం సచివాలయాలుగా తీర్చిదిద్దింది. వాటిల్లో సకల సౌకర్యాలు కల్పించింది. వాటిలో కొన్నింటిని ప్రస్తుత కూటమి ప్రభుత్వం క్యాంటీన్లను ఏర్పాటు చేస్తోంది. మరమ్మతులు కూడా పెద్దగా చేయాల్సిన పని లేదు. అయితే, కూటమి ప్రభుత్వం మరమ్మతుల పేరిట తెలుగు తమ్ముళ్లకు ఆదాయ మార్గం చూపుతోంది. ఒక్కో క్యాంటీన్ మరమ్మతులకు రూ. 10లక్షలు కేటాయించింది. ఈ నిధులతో భవనాలను సోకు పేరిట పచ్చ నేతలు కాసులు వెనకేసుకుంటున్నారు. భవనాలకు పసుపు పూత పూసి మాయ చేస్తున్నారు. ఫ్లోరింగ్ పేరిట మేకప్ వేసి సోకు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వ ప్రచార ఆర్భాటాన్ని, ప్రజల సొమ్ము దుర్వినియోగాన్ని పలువురు తప్పు పడుతున్నారు. ప్రజా అవసరాల రీత్యా గత ప్రభుత్వం సచివాలయాలు, ఆర్బీకేలు నిర్మిస్తే రాళ్లు వేసిన పచ్చ నేతల వ్యవహారం అత్తకు బుద్ధి చెప్పి కోడలు తెడ్డు నాకిన చందంగా ఉందని విమర్శిస్తున్నారు.

అన్నన్నా.. ఇదేం పని..?



ఆధునికీకరణ పేరుతో తమ్ముళ్ల దోపిడీ

చీరాల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాదేదీ దోపిడీకి అనర్హం అంటూ ప్రతీ పనికీ రూ.లక్షల్లో ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో శాశ్వత ప్రభుత్వ భవనాలైన ఆర్బీకేలు, సచివాలయాలు తదితర శాశ్వత భవనాలను భావితరాల అవసరాలకోసం నిర్మాణం చేశారు. కానీ కూటమి ప్రభుత్వం పసుపు రంగుల వేసి పాత భవనాల ఆధునికీకరణ కోసం రూ. లక్షల్లో ప్రజాధనాన్ని కాజేస్తోంది. చీరాలలోని అన్న క్యాంటీన్‌కు పసుపు రంగులు, లైట్లు, టైల్స్, గార్డెనింగ్, షోకేసులకు మరమ్మతులు చేసినట్లు చూపి రూ.9 లక్షలు కొల్లగొట్టారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. తిలాపాపం తలాపిడికెడు చందంగా తెలుగు తమ్ముళ్లు అందినకాడికి పంచుకుతిన్నారు.



ఖర్చు బారెడు.. పనులు మూరెడు

రేపల్లె రూరల్: పట్టణంలోని అన్న క్యాంటీన్ మరమ్మతులు ఖర్చు బారెడు.. పనులు మూరెడు అనే చందంగా ఉంది. గ్యాస్ కంపెనీ రోడ్డులోని సచివాలయం పక్కనే ఉన్న సర్వే కార్యాలయంలో క్యాంటీన్ ఏర్పాటు చేశారు. భవనానికి టైల్స్, ఫ్లోరింగ్, వంట పాత్రలు నిలుపుకునేందుకు దిమ్మెలు, అద్దాల అమరిక, రంగులకు రూ.10లక్షలు మంజూరు చేశారు. మొత్తంగా రూ.3లక్షలకు కూడా వ్యయం కాని పనులకు రూ.10లక్షలు కేటాయించడంపై పట్టణ ప్రజలు, ప్రజా సంఘాలు పెదవి విరిస్తున్నాయి.



సోకులకు ప్రజల సొమ్ము

బాపట్ల: ప్రజల సొమ్ముతో కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను సోకు చేస్తోంది. జిల్లా కేంద్రంలో క్యాంటీన్‌కు రూ.10లక్షలు మేరకు మున్సిపాల్టీ తీర్మానం చేసి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించింది. గతంలోనే క్యాంటీన్‌లో అన్ని హంగులు ఉన్నాయి. మళ్లీ రంగులు వేయడం, చిన్న,చిన్న మరమ్మతులకు అంత నగదు కేటాయించటంపై ప్రజలు సైతం ఆశ్చర్యానికి గురవుతున్నారు.గత ప్రభుత్వం సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి సైతం రూ.15నుంచి 25లక్షలు ఖర్చు చేసింది. బాపట్లలో అన్న క్యాంటీన్ తాత్కాలిక మరమ్మతులకు రూ.10లక్షలు కేటాయించటం చూస్తుంటే ప్రజల సొమ్ము ఏమేరకు దుర్వినియోగం అయిందో ఇట్టే అర్థమవుతోంది.

చి'వరి'కి కన్నీరే !

ఖరీఫ్‌లో వరి సాగు చేపట్టిన రైతులు సాగునీటి సమస్యలతో కన్నీటి పర్యంతమవుతున్నారు. కాలువల ద్వారా చుక్కనీరు అందడం లేదు. నీటి సరఫరా వ్యవస్థను ప్రభుత్వం సమర్థంగా నిర్వహించకపోవడంతో రైతాంగానికి కంటి మీద కునుకు కరువైంది. ప్రభుత్వ వైఫల్యానికి తోడు వరుణుడు ముఖం చాటేయడంతో పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. కంటికి రెప్పలా కాపాడుతూ సాగు చేసిన వరి పైర్లు ఎండు ముఖం పట్టాయి. ఎకరాలకు ఎకరాల పంట పనికి రాకుండా పోతుండటంతో ఆందోళనకు లోనవుతున్నారు. పంటను రక్షించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. కాలువలు, మురుగు డ్రెయిన్లలో అడుగంటిన నీటిని ఆయిల్ ఇంజన్ల సాయంతో తోడి పంటలకు మళ్లిస్తుండటంతో రైతులు అదనపు పెట్టుబడి భారానికి గురవుతున్నారు.



బొద్దులూరుపాడు సమీపంలో ఎండిపోయిన వరి పొలం

- నెర్రెలిచ్చిన పంట పొలాలు
- ఖరీఫ్ రైతుల కంట కన్నీరు
- పశ్చిమ బ్యాంక్ కెనాల్ ఆయకట్టుకు అందని సాగు నీరు
- రెండు నెలల పంట ఎండు ముఖం
- ఆయిల్ ఇంజన్ల సాయంతో నీరు
- రైతులకు పెట్టుబడి వ్యయం పెరుగుదల



తాడిగిరిపాడు డొంక రోడ్డులో చుక్క నీరు లేని పంట కాలువ

కొల్లూరు : పశ్చిమ బ్యాంక్ కెనాల్ కింద జిల్లాలో 1.55 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఖరీఫ్‌లో రైతులు ఎక్కువ భాగం వరి సాగు చేస్తున్నారు. ఏటా దుక్కి దున్ని పొలాల్లో నాట్లు వేసేవారు. అయితే, ఈ ఏడాది ఆయకట్టు పరిధిలో 70 శాతం వరకు నీటి కొరత నెలకొంది. దీంతో నీటి అవసరం తక్కువగా ఉండే వెద పద్ధతికి మొగ్గు చూపారు. మిగిలిన భాగంలో నాట్లు వేశారు.

సాగునీటి విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యం

పంటలకు సకాలంలో సాగునీరు అందించడంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించింది. నీటి ఎద్దడి రైతాంగాన్ని కలవరపాటుకు గురి చేస్తోంది. వాస్తవానికి ప్రధాన పశ్చిమ బ్యాంక్ కెనాల్ పూర్తి సాగునీటి సామర్థ్యం 2,001 క్యూసెక్కులు. బలహీనంగా ఉన్న కాలువ కట్టలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో సామర్థ్యం తగ్గిపోయింది. ప్రస్తుతం కాలువ పరిధిలోని ఆయకట్టుకు 1,700 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేస్తూ ప్రభుత్వం చేతులు దులుపుకుంది. దీంతో సాగు నీటి ఎద్దడి నెలకొంది.

పంట కాలువల వ్యవస్థ అస్తవ్యస్తం

పశ్చిమ బ్యాంక్ కెనాల్ పరిధిలోని వేమూరు, కొల్లూరు, వెల్లటూరు, రేపల్లె, ఇసుకపల్లి (రేపల్లె) సెక్షన్ల ద్వారా వివిధ బ్రాంచ్ కాలువలకు సాగు నీటిని విడుదల చేసి ఆయకట్టుకు నీరు అందించాల్సి ఉంది. అయితే, పంట కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. పలుచోట్ల పూడుకు పోయాయి. అరకొరగా విడుదలవుతున్న నీరు కాలువల అడుగు భాగానికే పరిమితమవుతోంది. పొలాలకు నీరు అందకుండా పోతోంది. ఆయకట్టు ఆరంభంలోనే రైతులు నీటిని దిగువకు వెళ్లకుండా అడ్డుకట్టలు వేయడంతో చివరి పొలాలు సాగునీటి కొరతకు గురవుతున్నాయి. ఎండిపోతున్న పంటల్ని కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. డ్రెయిన్లు, పంట కాలవుల అడుగు భాగంలోని నీటిని అయిల్ ఇంజన్లు, బోర్ల సాయంతో కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. రాత్రనక, పగలనక పంట పొలాలకే పరిమితమై నీరు అందించే ప్రయత్నాల్లో కొట్టుమిట్టాడుతున్నారు. కాలువల సామర్థ్యం మేరకు నీటి విడుదల లేకపోవడంతో కొల్లూరు మండలంలోని చినపులివర్రు, కోటిపల్లి, తాడిగిరిపాడు, రావికంపాడు, బొద్దులూరుపాడు, కొల్లూరు, వేమూరు మండలంలోని పెనమర్రు, చావలి, అబ్బనగూడవల్లి, కోడిపర్రు, భట్టిప్రోలు, చెరుకుపల్లి, రేపల్లె మండలాల్లో నీరందక వెద సాగు చేసిన పొలాలు ఎండు ముఖం పట్టాయి. కొన్నిచోట్ల పంట భూములు నెర్రెలిచ్చాయి.

పెరుగుతున్న ఖర్చులు

సాగునీటి కొరత రైతులపై పెట్టుబడి భారాన్ని పెంచుతోంది. వాస్తవానికి వెద పద్ధతిలో పంట చేతికందే సమయానికి ఇంచుమించు ఎకరాకు రూ. 25 వేలు, నాట్ల పద్ధతిలో రూ. 30 వేలు పెట్టుబడి అవుతోంది. సాగు నీటి సమస్య కారణంగా రైతులు నెల రోజులు పైబడి పంటలకు ఆయిల్ ఇంజన్ల ద్వారా నీరు అందిస్తుండటంతో పెట్టుబడి తలకు మించిన భారంగా మారింది. ఎకరా పంట తడపడానికి అయిల్ ఇంజన్, నీటి ట్యూబ్‌ల అద్దె, డీజిల్ కలుపుకొని ఒక్కో తడికి రూ. 1,500 వరకు అవుతుంది. నెల రోజుల వ్యవధిలో మూడు దఫాలు నీటి తడులు ఇవ్వాల్సి రావడంతో రూ. 4,500 వరకు అదనంగా పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. సాగు ఆరంభంలోనే ఖర్చులతో రైతులు సతమతమవుతున్నారు. నీటి ఎద్దడి కారణంగా పంట దెబ్బతిని దిగుబడులు గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితుల్లో పెట్టుబడులు కూడా దక్కుతాయోలేదోనన్న ఆందోళన రైతుల్నికలచి వేస్తోంది.



బొద్దులూరుపాడు డొంక రోడ్డులో ఆయిల్ ఇంజిన్‌ను లాక్కెళుతున్న రైతులు

నీరందక పంట దెబ్బతింటోంది



కాల్వల ద్వారా సాగు నీరు అందుతుందన్న ఆశతో వరి సాగు చేపట్టాం. ప్రస్తుతం అందకపోతుండటంతో ఎండుముఖం పట్టింది. ఆయిల్ ఇంజన్ల సాయంతో మురుగు కాల్వల్లోని నీటిని పంటలకు మళ్లించుకుంటున్నాం. నీరు ఎంత పెట్టినా ఎండలకు నిలవకుండా భూమి బీటలు వారిపోతోంది. ప్రభుత్వం వెంటనే కాలువలకు సాగు నీరు విడుదల చేయాలి.

-కొలుసు వెంకటేశ్వరరావు, బొద్దులూరుపాడు, కొల్లూరు మండలం

పూడిపోయిన కాల్వలు



కాలువ వెంబడి ఉన్న భూములకు సైతం పూడిక కారణంగా నీరందకుండా పోతుంది. పల్లపు భూములకు నీరు రాకపోవడంతో కాలువలు ఉండీ ప్రయోజనం లేకుండా పోయింది. కాలువ ద్వారా నీరు అందుతుందన్న ఆశలు సన్నగిల్లాయి. చేసేదిలేక బోర్లు, ఆయిల్ ఇంజన్ల ద్వారా పెట్టుకొని పంటలను బతికించుకునేందుకు పోరాడుతున్నాం.

-ఉప్పాల సురేంద్ర, చినపులివర్రు, కొల్లూరు మండలం

పొలాల్లోనే పడిగాపులు



కాలువలో నీరు ఎగువ నుంచి దిగువకు ఏ సమయంలో వస్తుందో తెలియని పరిస్థితుల్లో భార్యాపిల్లలను వదిలి రాత్రిళ్లు సైతం పొలాల్లోనే పడిగాపులు కాస్తున్నాం. ఎగువ పొలాల రైతులు అడ్డుకట్టలు కట్టి నీటిని నిలిపి వేస్తున్నారు. నీటి కోసం ఎదురు చూసి విష కీటకాల బారిన పడి ప్రాణాలు కోల్పోతామేమోనన్న భయం వెంటాడుతోంది.

-కొలుసు అంకినీడు, యాదవపాలెం, కొల్లూరు మండలం.

పెట్టుబడి భారంతో సతమతం



పంట సాగుకు అయ్యే పెట్టుబడికి తోడు, సాగునీరు అందకపోవడంతో ఆయిల్ ఇంజన్లతో పెట్టుకోవాల్సిన పరిస్థితి. దీంతో పెట్టుబడులు పెరిగి సతమతం అవుతున్నాం. జులై 7న కాలువ ద్వారా పంటకు నీరు అందించుకోగలిగాం. ఆ తరాత్వ చుక్క నీరు లేదు. అప్పట్నుంచి ఆయిల్ ఇంజన్ ద్వారానే పెట్టుకుంటున్నాం.

-కొల్లూరు వెంకట నరసయ్య, బొద్దులూరుపాడు, కొల్లూరు మండలం.

జీజీహెచ్‌లో జూడాల సమ్మె ఉద్ధృతం

- అత్యవసర సేవలు సైతం బహిష్కరణ
- ర్యాలీగా గుంటూరులో నిరసన ప్రదర్శన



గుంటూరు మెడికల్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ గుంటూరు జీజీహెచ్‌లో జూనియర్ వైద్యులు చేస్తున్న సమ్మె శుక్రవారం నాలుగో రోజుకు చేరింది. అత్యవసర సేవలకు హాజరైన జూనియర్ వైద్యులు శుక్రవారం వాటినీ బహిష్కరించారు. తమపై దాడులు నిలువరించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని, తక్షణమే రక్షణ చట్టాలు అమలులోకి తీసుకురావాలన్నారు. వైద్యురాలి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. రోగుల సేవలు చేస్తున్న సమయంలో తమకు రక్షణ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇదే విషయాన్ని చెబుతూ జూనియర్ వైద్యులు తలకు, కాళ్లకు, చేతులకు బ్యాండేజ్ కట్లు కట్టుకుని నిరసన తెలియజేశారు. వైద్యులపై జరుగుతున్న దాడులను నిలువరించేలా అందరూ సహకరించాలని లఘు నాటిక ప్రదర్శించారు. ఆసుపత్రి నుంచి నాజ్‌సెంటర్ మీదుగా జీజీహెచ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. సీనియర్ వైద్యులు సైతం జూడాల సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ వైద్యుల సంఘం నాయకులు డాక్టర్ దీక్షిత్, డాక్టర్ అన్వర్ బాషా, డాక్టర్ రవి, డాక్టర్ అశ్విని, డాక్టర్ భవిత పాల్గొన్నారు.

నేడు వైద్యసేవలు బంద్

నరసరావుపేట: పశ్చిమ బెంగాల్‌లో మహిళా డాక్టర్‌పై లైంగిక దాడి, హత్యను నిరసిస్తూ నరసరావుపేటలో ప్రైవేటు హాస్పిటళ్లలో వైద్యసేవలను శనివారం ఉదయం ఆరు నుంచి ఆదివారం ఎనిమిదిగంటల వరకు బంద్ చేస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) డాక్టర్లు ప్రకటించారు. అత్యవసర సేవలకు మినహాయింపు ఉంటుందన్నారు. శుక్రవారం పెద్దచెరువులోని ఐఎంఏ భవనంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు నాగోతు ప్రకాష్, పాలూరి శ్రీనివాసరెడ్డి తెలియజేశారు.

పేదల కడుపు నింపేందుకే అన్న క్యాంటీన్లు

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



భోజనం వడ్డిస్తున్న మంత్రి అనగాని

రేపల్లె రూరల్: పేదల కడుపు నింపేందుకే అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ పార్కు వద్ద క్యాంటీన్‌ను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. సుదూర ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే ప్రజలకు, పట్టణంలో వివిధ ప్రాంతాల్లో పని చేసుకునే వారికి, పేదలకు క్యాంటీన్లు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పేదలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టించాలంటే కొంత సమయం పడుతుందని తెలిపారు. రేపల్లె పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. అనంతరం ప్రజలతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో హెలా షారోన్, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, కమిషనర్ శేషాద్రి, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్, పంతాని మురళీధరరావు, తాతా ఏడుకొండలు, జనసేన నాయకులు రాసంశెట్టి మహేష్ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ప్రారంభించిన మంత్రి లోకేష్



తాడేపల్లి రూరల్: గుంటూరు జిల్లా నులకపేటలోని అన్న క్యాంటీన్‌ను శుక్రవారం పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. కార్పొరేషన్ అధికారులు, టీడీపీ నాయకుల సమక్షంలో క్యాంటీన్‌ను ప్రారంభించి, అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుడివాడలో క్యాంటీన్‌ను ప్రారంభించారని, రాష్ట్ర వ్యాప్తంగా 33 మున్సిపాలిటీల్లో 100 క్యాంటీన్‌లను పేద ప్రజల కోసం అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు.



సిరులివ్వు శ్రీలక్ష్మి !

పవిత్ర శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని పట్టణంలోని పలు దేవాలయాలలో అమ్మవార్లు లక్ష్మీదేవి అలంకరణలలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామదేవత శ్రీ బూరుగులమ్మ అమ్మవారి ఆలయంలో వేకువజాము నుంచే సుప్రభాత సేవలతో పండ్ల రసాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి లక్ష్మీదేవిగా అలంకరణ చేశారు. అమ్మవారికి 108 బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- రేపల్లె రూరల్

క్లుప్తంగా

అదుపుతప్పి బస్సు బోల్తా



అద్దంకి: నిద్రమత్తులో డ్రైవర్ బస్సు నడపంతో బోల్తా కొట్టి పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన అద్దంకి పట్టణ శివారులో అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలోని బలరామకృష్ణపురం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్ డిపోకు చెందిన బస్సు తిరుపతి నుంచి అక్కడకు వెళుతోంది. ఈ క్రమంలో బలరామకృష్ణాపురం సమీపంలోకి రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నాడు. దీంతో బస్సు అదుపుతప్పి డివైడర్ ఎక్కి బోల్తా కొట్టింది. ఒక పక్కకు ఒరగడంతో పెను ప్రమాదం తప్పింది. నిద్రమత్తులో ఉన్న ప్రయాణికుల్లో పది మందికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు మూడు 108 వాహనాల్లో వారిని ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

రేపు వక్ఫ్ చట్టం సవరణలపై రాష్ట్ర స్థాయి సదస్సు

లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్టం సవరణల గురించి రాష్ట్రస్థాయి సదస్సు ఈ నెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిష్టి అన్నారు. బ్రాడీపేట గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లింలపై బీజేపీ ప్రభుత్వం ఆర్థిక దాడులు చేస్తూ వక్ఫ్ స్వయం ప్రతిపత్తిని హరించేలా వ్యవహరిస్తోందన్నారు. ఈ విషయంలో కలెక్టర్లకు విచక్షణ అధికారాలు ఇవ్వడం సరి కాదన్నారు. ఈ చట్ట సవరణలు రాజ్యాంగ విరుద్ధమని ఆరోపించారు. పేద ముస్లిం ప్రజానీకం నుంచి ఆస్తులు కాజేసే కుట్రగా విమర్శించారు. వీటి గురించి అవగాహన కల్పించి ప్రజల్లో చైతన్యం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయ నిపుణులతో రాష్ట్ర సదస్సును 18వ తేదీ ఉదయం 10 గంటలకు బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తామని తెలిపారు. సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు ఎస్కే బాషా, ఖాసిం వలి, సలీం, ఎస్కే సైదా తదితరులు పాల్గొన్నారు.

తల్లిని బెదిరించబోయి యువకుడి మృతి



ప్రత్తిపాడు: తల్లిని బెదిరించేందుకు గడ్డి మందు తాగిన యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన ధర్నాసి కార్తిక్ (22) డిగ్రీ పూర్తి చేశాడు. పీజీ ఎంట్రన్స్ రాసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. గత నెల 28వ తేదీన చర్చికి వెళ్లమని కార్తిక్‌ను తల్లి మందలించింది. ఆమె బెదిరించే క్రమంలో గడ్డి మందు తాగాడు. వాంతులు చేసుకుని తీవ్ర అస్వస్థతకు గురైన కార్తిక్‌ను చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 15వ తేదీన అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి నిర్మల ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మానాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కమిషనర్ 'పచ్చ'పాతం

- ఉద్దేశపూర్వకంగా కౌన్సిల్‌కు అవమానం
- కలెక్టర్‌కు చైర్మన్ జంజనం శ్రీనివాసరావు ఫిర్యాదు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరావు

చీరాల: తనతో పాటు పలువురు కౌన్సిలర్లను కించపరచిన మున్సిపల్ కమిషనర్ కె. చక్రవర్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు పేర్కొన్నారు. తన చాంబర్‌లో శుక్రవారం ఆయన వైస్‌చైర్మన్ బొనిగల జైసన్ బాబు, కౌన్సిలర్ బత్తుల అనిల్, వైఎస్సార్ సీపీ నాయకులు యాతం మేరిబాబుతో కలసి విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున మువ్వెన్నెల జెండా సాక్షిగా కమిషనర్ కౌన్సిల్‌ను అగౌరవ పరచారని ధ్వజమెత్తారు. ముందుగా కౌన్సిలర్లకు, చైర్మన్‌కు ఉదయం 8.30 గంటలకు జాతీయ జెండా మున్సిపల్ కార్యాలయంలో ఆవిష్కరణ ఉంటుందని ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అయితే, 8.25 గంటలకు తాను అడుగు పెట్టిన వెంటనే ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్యతో జాతీయ జెండా ఆవిష్కరించి ప్రథమ పౌరుడైన తనను అవమానించారని తెలిపారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా ఆయన అందుబాటులో లేకపోవడంతో డీడీఆర్వో సత్తిబాబుకు అందించినట్లు జంజనం శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యేను గత నెలలో ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఎన్నుకున్నామన్నారు. ఆ సమయంలో అందరూ రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని చెప్పారని గుర్తు చేశారు. అందుకు విరుద్ధంగా కమిషనర్ కౌన్సిల్‌ను కాదని, అగౌరవపరిచే చర్యలు చేపడుతున్నారని విమర్శించారు.

అందరినీ కలుపుకొని వెళ్లిన కరణం

గతంలో ఎమ్మెల్యేగా కరణం బలరామకృష్ణమూర్తి ప్రతి ఒక్కరినీ కలుపుకుని వెళ్లారని చైర్మన్ జంజం శ్రీనివాసరావు గుర్తు చేశారు. లక్ష మంది జనాభాకు ప్రథమ పౌరుడు, బీసీ వర్గానికి చెందిన చేనేత నాయకుడును కమిషనర్ అవమానించడమేమిటని ఆరోపించారు. గత మూడేళ్లగా చైర్మన్ చేతుల మీదగానే జాతీయ జెండా ఆవిష్కరణ జరిగిందని, అయితే కమిషనర్ కుట్రపూర్వకంగా వ్యవహరించినట్లు ధ్వజమెత్తారు. చైర్మన్, కౌన్సిలర్లు వెళ్లేలోగా జాతీయ జెండాను ఆవిష్కరించడం, రూ.40 లక్షలతో కొనుగోలు చేసిన లేడర్ మిషన్‌ను ఎమ్మెల్యేతో ప్రారంభించడం తమను అవమానించడమేనని ఖండించారు. దీన్ని ప్రభుత్వ ఉన్నతాధికారులు, మంత్రులు దృష్టికి తీసుకెళతామని, గవర్నర్‌కు కూడా పోస్టల్ ద్వారా ఫిర్యాదు చేశామని చెప్పారు. కమిషనర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోకుంటే అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి కౌన్సిల్‌కు ఉన్న హక్కులతో ఆయనపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ శిఖాకొల్లి రామసుబ్బులు, కౌన్సిలర్లు ఎబినేజర్, తోకల అనిల్, గుంటూరు ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు శిఖా సురేష్, కోడూరి ప్రసాద్‌రెడ్డి, వాసిమళ్ల వాసు, గోసాల అశోక్ పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీలకు 'రిలీఫ్'ను వెంటనే విడుదల చేయాలి

కలెక్టర్‌కు దళిత నాయకుల వినతి



కలెక్టర్ జె.వెంకట మురళికి వినతిపత్రం అందిస్తున్న దళిత నాయకులు

బాపట్ల: ఎస్సీ,ఎస్టీలకు పెండింగ్‌లో ఉన్న రిలీఫ్‌ను వెంటనే విడుదల చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు కోరారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రిలీఫ్ జాబితాను కలెక్టర్ జె.వెంకట మురళికి శుక్రవారం ఆయన అందజేశారు. కర్లపాలెంలో ఫిబ్రవరి 8న హత్యకు గురైన ఎస్టీ యానాది కులస్తుడు చల్లా పిచ్చయ్య కుటుంబ సభ్యులకు రిలీఫ్, ప్రభుత్వ ఉద్యోగం, ఎస్సీ, ఎస్టీ స్పెషల్ మంత్లీ పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. గ్రామానికి చెందిన ఎస్టీ యానాది కులస్తుడు పిచ్చయ్యను పఠాన్ కరీముల్లా ఖాన్ కర్రతో కొట్టి చంపారని వివరించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారన్నారు. హత్య జరిగి ఆరు నెలలు పూర్తవుతున్నా హతుడి కుటుంబ సభ్యులకు రిలీఫ్ పెన్షన్ ఎంప్లాయిమెంట్ మంజూరు చేయలేదని తెలిపారు. కొత్తగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో అట్రాసిటీ యాక్ట్ కింద కేసులు పెట్టిన బాధితులకు రిలీఫ్ మంజూరు కావడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. రిలీఫ్ బిల్లుల్ని చేసేందుకు అవసరమైన బాధితుల ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలను తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టరేటుకు పంపడం లేదని ఆరోపించారు. ఒకవేళ తహసీల్దార్లు పంపినా ఫైళ్లు కలెక్టరేట్‌లో ముందుకు కదలడం లేదని తెలిపారు. జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులకు గానూ ఎంత మొత్తం రిలీఫ్ అవసరమో సీ సెక్షన్ సూపరింటెండెంట్ వద్ద అంచనా లేదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. జిల్లాలోని కేసుల్ని బట్టి అవసరమైన నిధుల్ని ప్రభుత్వం నుంచి రాబట్టేందుకు ఇంతవరకు ప్రతిపాదనలు పంపలేదని తెలిపారు. మంత్లీ పెన్షన్లకు కూడా బిల్లులు చెల్లించడం లేదన్నారు. బత్తినేని నాని, బత్తినేని మణికంఠల పెన్షన్ ప్రతిపాదనలు కలెక్టరేట్‌కు వచ్చినా రాలేదని సమాధానం చెబుతున్నారని నాగేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము సుజన్ మాదిగ, రావినూతల జై కుమార్ ఉన్నారు.

ఖాకీల నిర్లక్ష్యంపై తల్లీకొడుకుల నిరసన

- కొల్లూరు పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన
- రేపల్లె–తెనాలి ప్రధాన రహదారిపై బైఠాయింపు



కొల్లూరు పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించిన తల్లీకొడుకులు

కొల్లూరు: పొలాల ఫోర్జరీ కేసులో పోలీసులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలతో తల్లీ కొడుకులు పోలీసుస్టేషన్ ఎదుట నడిరోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేసిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. నిరసనకు దిగిన తల్లి సాత నాగబసవపూర్ణ, కుమారుడు సాత శివప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. తమ తాత, ముత్తాతలైన అన్నంనేని ముత్తయ్య, నాంచారయ్యకు చెందిన పొలాలు వారు మరణించిన అనంతరం కొల్లూరుకు చెందిన ఇద్దరు ఆధార్ కార్డుల్లో వారి పేర్లను ముత్తయ్య, నాంచారయ్యలుగా మార్చుకొని ఫోర్జరీ సంతకాలతో తెనాలి, పెదరావూరు ప్రాంతాలకు చెందిన వ్యక్తులకు విక్రయించారు. అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో 2022లో కేసు నమోదు చేసి నిందితుల్ని అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపర్చడంతో రిమాండ్ విధించారు. అయితే, అప్పట్నుంచి కేసు విషయంలో పోలీసులు చార్జిషీట్ దాఖలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఫోర్జరీ సంతకాలతో పొలాలు కొనుగోలు చేసిన వ్యక్తులు వీరిని బెదిరింపులకు గురిచేస్తూ, దాడులు చేసేందుకు తెగబడుతున్నారు. గత నెల 22 నుంచి పదిసార్లు ఫిర్యాదులు చేసినా కేసు నమోదు చేయకుండా పోలీసులు ఫోర్జరీ సంతకాలతో పొలాలు కొనుగోలు చేసిన వ్యక్తులకు సహకరిస్తున్నారంటూ రోడ్డుపై బైఠాయించారు. అయితే ఎస్‌ఐ జి. ఏడుకొండలు రహదారిపై బైఠాయించిన తల్లీకొడుకులను స్టేషన్‌లోకి వస్తే సమస్యపై మాట్లాడతామని కోరారు. అయితే, తమ పొలాల పత్రాలు సైతం అప్పట్లో విధుల్లో ఉన్న ఎస్‌ఐ, ఏఎస్‌ఐలు ఫోర్జరీ సంతకం దారుల వద్ద లంచాలు తీసుకొని వారికి అందించారని ఆరోపించారు. తమకు సత్వర న్యాయం జరిగే వరకు రోడ్డుపై నుంచి లేచేది లేదంటూ భీష్మించుకొని మూడు గంటలకు పైగా నిరసన కొనసాగించారు. రెవెన్యూ అధికారులు సైతం తాము ఫోర్జరీ సంతకాల వ్యవహారంపై ఫిర్యాదులు చేసినప్పటికీ, వాటిని పరిగణలోకి తీసుకోకుండా కౌలు రైతు గుర్తింపు కార్డులు మంజూరు చేశారని, వారిపైన కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అయితే, ఎస్‌ఐ ఏడుకొండలు తాను కొత్తగా వచ్చిన నేపథ్యంలో గతంలో నమోదు చేసిన కేసు ఫైల్ పరిశీలించి చట్టపరంగా చర్యలు చేపడతామని, నిరసన విరమించాలని సూచించారు. తమకు న్యాయం జరిగే వరకు రోడ్డుపై నుంచి కదిలే ప్రసక్తే లేదని భీష్మించుకొని కూర్చున్నారు. కొల్లూరు వీర్వో సురేష్ ఫిర్యాదు మేరకు పోలీసు స్టేషన్ ఎదురుగా రహదారిపై బైఠాయించి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించినందుకు ఇద్దరినీ అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

మాజీ ఎంపీపీ ఇంటిపై టీడీపీ నాయకుల దాడి



మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు ఇల్లు

చెరుకుపల్లి: రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇలాకాలో టీడీపీ నాయకుల దౌర్జన్యాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయి. ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సానుభూతిపరులే లక్ష్యంగా దాడులకు తెగబడుతున్నారు. ఆస్తులను సైతం ధ్వంసం చేస్తున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని నిత్యం దాడులకు పాల్పడుతూ పైశాచికానందాన్ని పొందుతున్నారు. శుక్రవారం మండలంలోని గుళ్లపల్లికి చెందిన మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకుడు చెన్ను కోటేశ్వరరావు ఇంటిపై టీడీపీ నాయకుడు కలగంటి కుమార్‌తో పాటు మరికొందరు దాడికి తెగపడ్డారు. మద్యం మత్తులో కోటేశ్వరరావు ఇంటిపై రాళ్లు విసరడంతో అద్దాలు ధ్వంసమయ్యాయి. అడ్డుకోబోయిన కోటేశ్వరరావు కారు డ్రైవర్ గాలి సంపత్‌కుమార్‌పై కూడా దాడికి తెగబడటంతో స్థానికులు అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో చెరుకుపల్లి ఎస్‌ఐ అనిల్‌కుమార్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని, అల్లరిమూకల్ని చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అయితే, ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి గ్రామాన్ని వదిలి వెళ్లిన మాజీ ఎంపీపీ వారం రోజుల క్రితమే స్వగ్రామం గుళ్లపల్లి వచ్చారు.

పేదల కడుపునింపడమే ప్రభుత్వ లక్ష్యం



క్యాంటీన్‌లో టిఫిన్ చేస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య



అద్దంకిలో క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రవికుమార్

చీరాల: పేదల కడుపు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని బాపట్ల ఎంపీ టి.కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. చీరాలలోని హైస్కూల్ రోడ్డులో శుక్రవారం అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కూలీలు, కార్మికులు అధికంగా ఉన్న చీరాలలో తొలి విడత క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడంతో వారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. పెళ్లిరోజు, పుట్టినరోజు, ఇతర వేడుకలకు దాతలు ఎవరైనా క్యాంటీన్‌లో విరాళాలు అందించాలని కోరారు. తొలిరోజు రూ.5 లక్షల విరాళాలు వచ్చాయని ఎమ్మెల్యే తెలిపారు. అన్న క్యాంటీన్‌కు ఆయన రూ.54వేలు విరాళం ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి ఎం.ఎం. మహేంద్రనాథ్, మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి, కౌన్సిలర్లు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

క్యాంటీన్ నిర్వహణకు దాతల విరాళాలు అభినందనీయం

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలో శుక్రవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాంటీన్ నిర్వహణకు దాతలు విరాళాలు అందించడం అభినందనీయం అన్నారు. అద్దంకికి చెందిన కోనేటి అనిల్ రూ.1 లక్ష, వెంకటాపురానికి చెందిన దాట్ల సోదరులు రూ.1 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జ్వరాలు విజృంభిస్తే సిబ్బందిపై వేటు

జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రేమ్‌చంద్



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జిల్లా మలేరియా అధికారి

బాపట్ల టౌన్: జ్వరాలు విజృంభిస్తే సిబ్బందిపై వేటు తప్పదని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కె. ప్రేమ్ చంద్ హెచ్చరించారు. మండలంలోని ముత్తాయపాలెంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఒక్క గ్రామంలోనే ప్రతిరోజూ ఓపీకి 50 మంది వరకు వస్తున్నారంటే జ్వరాల ఉద్ధృతిని తెలియజేస్తోందన్నారు. ఇప్పటికి ఎంత మందికి శాంపిల్స్ సేకరించారు.. వారిలో ఏ రకాల జ్వరాలు ఉన్నాయి.. జ్వరాల నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారంటూ? ఆయన సిబ్బందిని ప్రశ్నించారు. గ్రామంలో పని చేస్తున్న ఏడుగురు ఏఎన్‌ఎంలు, 15 మంది ఆశా వర్కర్లతో వేర్వేరుగా మాట్లాడారు. గ్రామస్తుల ఇంటికి వెళ్లినప్పుడు కుటుంబ సభ్యులు వివరాలు క్షుణ్ణంగా తెలుసుకోవాలని చెప్పారు. గ్రామంలో చెత్తకుప్పలు తొలగించాలని, మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామంలో జ్వరాలు పూర్తిగా తగ్గేవరకు అంతా ఉదయం నుంచి సాయంత్రం విధుల్లో ఉండాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, గ్రామస్తులతో దురుసుగా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉప్పటూరులో పోలీసు పికెట్ ఏర్పాటు

రెండు వర్గాల మధ్య ఘర్షణ

చినగంజాం (పర్చూరు): మండలంలోని ఉప్పుటూరులో మట్టి తవ్వుకునే విషయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పర్చూరు సీఐ సీతారామయ్య నలుగురు పోలీసులతో పికెట్ ఏర్పాటు చేశారు. స్థానిక నేతల అనుమతితో నాలుగు రోజుల నుంచి గ్రామంలో ముస్లింలు షాదీఖానా, శ్మశానవాటికలకు మట్టి తోలుకుంటున్నారు. వాటర్ ట్యాంక్ వద్ద ఉత్తరం వైపున ఉన్న మూడో చెరువులోని మట్టిని షాదీఖానా, శ్మశానవాటికలకు తప్పా ఇతర ప్రాంతాలకు తరలించకూడదు. చెరువుని లోతుగా తవ్వడంతో పాటు మట్టిని ఇతర ప్రాంతాలకు కూడా తరలిస్తున్నారన్న కారణంతో స్థానిక ఓ వర్గం నాయకులు అడ్డుచెప్పారు. దీంతో గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఎదురుపడి వాగ్వివాదానికి కూడా దిగారు. చీరాల రోడ్డు ఎక్కి కొద్దిసేపు ధర్నా చేశారు. సమాచారం అందుకున్న స్థానిక సీఐ సిబ్బందితో వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రెండు వర్గాల వారిని పిలిచి చర్చలు జరిపారు. ప్రస్తుతానికి మట్టి తవ్వకాలు ఆపాలని ఇద్దరికీ నచ్చజెప్పారు. గ్రామంలో అలజడులు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా పికెట్ ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు. రెచ్చగొట్టే ధోరణితో ఎవరైనా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గుంటూరు రేంజ్‌లో మరో ఆరుగురు సీఐలు బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో మరో ఆరుగురు సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీచేశారు.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
జి.వేణు	రేంజ్ వీఆర్, గుంటూరు	నెల్లూరు రూరల్ పీఎస్, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా
షేక్.సుభాని	రేంజ్ వీఆర్, గుంటూరు	నార్త్ ట్రాఫిక్ పీఎస్, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా
జి.రాజేశ్వరరావు	రేంజ్ వీఆర్, గుంటూరు	కావలి రూరల్ యూపీఎస్, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా
టి.వెంకటేశ్వర్లు	రేంజ్ వీఆర్, గుంటూరు	పొదిలి సర్కిల్, ప్రకాశం జిల్లా
ఎ.అశోక్‌కుమార్	డీసీఆర్‌బీ, పల్నాడు	ఈస్ట్ ట్రాఫిక్ పీఎస్, గుంటూరు జిల్లా
మేడా శ్రీనివాసరావు	ఇంటెలిజెన్స్	ఒంగోలు 2 టౌన్ పీఎస్, ప్రకాశం జిల్లా

వైభవంగా పల్నాటి వీర్ల అంకాలమ్మ మహోత్సవం



అమ్మవారి ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రంలో కొలువైఉన్న వీర్ల అంకాలమ్మ తల్లి బోనాల ఉత్సవం శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కనులపండువగా జరిగింది. కుంకుమ బండ్లు కట్టి వేలాదిగా మహిళలు బోనాలు సమర్పించారు. అంకాలమ్మతో పాటు గ్రామ దేవతలు పోలేరమ్మ తల్లి, పాతపాటేశ్వరమ్మ అమ్మవార్లకు పోతురాజుకు భక్తులు నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా పడి పంటలు బాగా పండాలని గ్రామదేవతలకు పూజలు చేశారు. ఉత్సవంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. కుంకుమ బండ్లకు పూజలు చేసి వాటిని ప్రారంభించారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. దీంతో ప్రతి గడపలో పండుగ వాతావరణం నెలకొంది. రాత్రి పల్నాటి బ్రహ్మనాయుడు నృసింహకుంతం తోడురాగా అంకాలమ్మ తల్లి గ్రామోత్సవానికి బయలు దేరారు. ప్రతి గడప అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

అమరేశ్వరునికి దివీస్ ల్యాబ్ వాటర్ ప్లాంట్ విరాళం



స్థల పరిశీలన చేస్తున్న దివీస్ ల్యాబ్ ప్రతినిధులు, ఈఓ వేమూరి గోపీనాథశర్మ

అమరావతి: ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన అమరావతిలో కొలువైన అమరేశ్వరునికి సుమారు రూ.33లక్షల విలువైన గంటకు వెయ్యి లీటర్ల సామర్థ్యం గల వాటర్ ప్లాంట్‌ను దివీస్ లాబోరేటరీస్ లిమిటెడ్ విరాళంగా సమర్పించింది. సంస్థ ప్రతినిధులు మంగళవారం ఈవో వేమూరి గోపీనాథశర్మకు అంగీకార పత్రాన్ని అందజేశారు. కంపెనీ ప్రతినిధి కిశోర్ మాట్లాడుతూ దేవాలయంలో అమరేశ్వర జలప్రసాదం భక్తులకు అందచేయడం కోసం రూ.33,27,600తో రెండు 1000 ఎల్‌పీహెచ్ ఆర్వో ప్లాంట్‌లు, యూపీవీసీ షెల్లర్లు, కూలర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే వేసవి నాటికి భక్తులకు పరిశుభ్రమైన తాగునీరు అందించటానికి కృషి చేస్తామన్నారు. ఆలయ ఈవో వేమూరి గోపీనాథశర్మ మాట్లాడుతూ దేవాలయంలో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి కంపెనీ ప్రతినిధులతో కలసి స్థలపరిశీలన చేశామన్నారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా డెంగీ నిర్ధారణ పరీక్షలు

మలేరియా రాష్ట్ర డెప్యూటీ డైరెక్టర్ ఏటీ రామనాథం

తెనాలి అర్బన్: జిల్లా పరిధిలోని గుంటూరు, తెనాలి ప్రభుత్వ వైద్యశాలల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని మలేరియా రాష్ట్ర డెప్యూటీ డైరెక్టర్ ఏటీ రామనాథం సూచించారు. తెనాలి జిల్లా వైద్యశాలలోని ల్యాబ్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉందని తెలిపారు. ప్రజలందరూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పాత ప్రభుత్వ వైద్యశాలలోని సహాయ మలేరియా కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంటమాలజిస్ట్ పోలు కొండారెడ్డి, ఎస్.రామచంద్రుడు, సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి, తెనాలి పట్టణ, మండల, గుంటూరు పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి, ఎస్.శివగణేష్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సూపర్‌వైజర్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి టీ10 క్రికెట్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): మొట్టమొదటిసారిగా టీ10 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎస్ క్రిస్టోఫర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి స్థానిక బీఆర్ స్టేడియంలో ఈ పోటీలు ఉంటాయన్నారు. అండర్–14, 17, 19, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతిభకనబరచిన క్రీడాకారులను అక్టోబర్‌లో జరగనున్న జాతీయ పోటీలకు పంపిస్తామన్నారు. పూర్తి వివరాలకు 92741 11266 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.